తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# భక్తులకు స్నేహపూర్వక సేవలు

## ఎల్లుండి ఒకేరోజు ఏడువాహనాల ఊరేగింపు

## అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు



తిరుమల, జనవరి 22 ప్రభాతవార్తప్రతినిధి:

కలియుగవైకుంఠం ఏడుకొండల్లో ఆదివారం జరగనున్న మినీబ్రహ్మోత్సవమ్ (సూర్య జయంతి- రథసప్తమి) వేడుకలకు తరలివచ్చే భక్తులకు అన్ని విభాగాలు, శాఖలు సమన్వయంతో స్నేహపూర్వక సేవలందించేలా ప్రణాళికలు రూపొందించారు. ఆలయ మాఢవీధుల్లో ఆరోజు ఉదయం నుండి రాత్రి వరకు వాహనాల వీక్షణకు వేచివుండే భక్తులకు అన్ని రకాలుగా అధికారులు, సిబ్బంది సేవలందిస్తారన్నారు. ఆదివారం రథసప్తమివేడుకల ఏర్పాట్లు, మాఢవీధుల్లో గ్యాలరీలు, భక్తులను అనుమతించడం, నిష్క్రమణ ద్వారాలు ఏర్పాట్లపై గురువారం సాయంత్రం టిటిడి ఛైర్మన్ బిఆర్నాయుడు, టిటిడి ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, సివిఎస్ఓ మురళీకృష్ణ, డిఎస్పీ విజయశేఖర్, విజిలెన్స్ అధికారులు, పోలీసులతో కలసి మాఢవీధులను తనిఖీ చేశారు. ఏర్పాట్లపై నిశితంగా పరిశీలించారు. అనంతరం అన్నమయ్యభవనంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఈఓ అనిల్‌కుమార్‌సింఘాల్, అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి అన్ని విభాగాలతో కలసి సమీక్షించారు. మాఢవీధుల్లో స్వామివారు అమ్మవార్లతో కలసి ఊరేగనున్న నేపథ్యంలో భగవంతుని సేవతో సమానంగా భక్తులకు అవసరమైన సేవలు మర్యాదపూర్వకంగా, మంచిమాటతో అందించేలా అధికారులకు నిర్ధేశం చేశారు. మాఢవీధుల్లో వాహనసేవల వీక్షణకు అన్ని చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ఆలయంలో జరిగే అన్ని ఆర్జిత సేవలు రద్దుచేశామన్నారు. భక్తులకు గ్యాలరీ ల్లోకి చేరుకునేలా, నిష్క్రమణ, నిరంతరాయంగా అన్నప్రసాదాలు, తాగునీరు, టీ, కాఫీ పంపి ణీ, మరుగుదోడ్లు అందుబాటులో ఉంచామన్నారు. భద్రత పరంగా పోలీసులు, విజిలెన్స్ సమన్వయంతో పనిచేస్తారన్నారు. మాఢవీధుల్లో అవసరమైన ప్రాంతాల్లో అదనపు ఏర్పాట్లు చేశారు.

**-ఎల్లుండే మినీబ్రహ్మోత్సవం:**

మాఘమాసం సప్తమితిథి ఆదివారం ఒకేరోజు శ్రీవేంకటేశ్వరస్వామి ఏడువాహనాలపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. ఆ రోజు ఉదయం5.30గంటల నుండి రాత్రి 9గంటల వరకు కలియుగప్రత్యక్షదైవమ్ శ్రీవేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తి మలయప్పస్వామి ఉభయ దేవేరులతో కలసి సప్తవాహనాలపై ప్రత్యక్షమిస్తారు. రథసప్తమిన తొలివాహనంగా ఉదయం 5.30గంటలకు సూర్యప్రభవాహనంతో మొదలై చివరగా రాత్రి 7గంటలకు చంద్రప్రభవాహనసేవతో వాహనసేవలు ముగుస్తాయి.

# సిఎస్ విజయానంద్ జిల్లా కలెక్టర్‌తో సమీక్ష

తిరుపతి కలెక్టరేట్, జనవరి 22 ప్రభాతవార్త :



గురువారం సాయంత్రం రాష్ట్ర సచివాలయంలోని సిఎస్ విజయానంద్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి సిసి కెమెరాలు, అన్నక్యాంటీన్లు, మహిళలపై దౌర్జన్యాలు, గంజాయి, మాదకద్ర వ్యాలు, మున్సిపాలిటీలలో పారిశుధ్యం, ఎస్సి, ఎస్టీ వసతి గృహాలు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లు, సంబంధిత స్పెషల్ కార్యదర్శులు, తదితర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. తిరుపతి జిల్లా నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ సంబంధిత జిల్లా అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు.

# శిధిల భవనాలు : విషపురుగులకు నిలయాలు

## పడగొట్టడానికి ముహూర్తమే లేదా?



డస్ట్‌బిన్‌గా మారిన నర్సుల క్వార్టర్స్,



పచ్చదనంతో నిండిన డాక్టర్స్ క్వార్టర్స్

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి పట్టణ పరిధి పెరుగుతుంది కాబట్టి 1999లో అప్పటి చంద్రబాబునాయుడు ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు నిధులు 5కోట్లు సాధించి ఇక్కడ ఏరియా ఆసుపత్రిని వంద పడకలతో నిర్మించారు. ఇక్కడ సకల సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకున్నారు. వంద పడకలతో పాటు నర్సులు, స్థాఫ్ నర్సులు, డాక్టర్లు అందుబాటులో ఉండటానికి క్వార్టర్స్‌ను నిర్మించారు. అయితే ఎంతో మహోన్నతాశయంతో నిర్మించిన క్వార్టర్స్ నేడు విషపురుగులకు నిలయంగా మారింది. నర్సుల క్వార్టర్లు డస్ట్‌బిన్‌గా మారి ఆసుపత్రిలో ఉపయోగించని వస్తువులు వేసుకుంటున్నారు. ఇక డాక్టర్ క్వార్టర్స్ పిచ్చిమొక్కలు విషపురుగులకు నిలయంగా మారింది. ఇలా సుమారు పది సంవత్సరాల నుంచి పాడుబడి ఉన్నాయి. వీటిని నిర్మించిన ఉద్దేశ్యం ప్రతి నిత్యం నర్సులు, స్టాఫ్‌నర్సులు, డాక్టర్లు క్వార్టర్స్ ఉంటే ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడినపుడు వెంటకే స్పందిస్తారని రోగులను ఆదుకుంటారనే మహోన్నత లక్ష్యం నేడు విషపురుగుల కు నిలయంగా మారింది. లక్షలు వెచ్చించి నిర్మించిన క్వార్టర్స్ శిధిలమవటంతో ఇక్కడ ఉండాల్సిన ఉద్యోగులు బయట ఉంటున్నారు. దాంతో ఏదైనా అత్యసర పరిస్థితి ఏర్పడినపుడు పట్టణం నుంచి రావటానికి సమయం పడుతుంది. అంతలోపల ఆసుపత్రిలో జరగాల్సిన నష్టం జరిగిపోతుంది.

**ఎంఎల్ఏ చొరవ:**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్థానిక శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి చొరవ చూపారు. అభివృద్ధిపై దృష్టి సారించారు. అంతేకాక ఇక్కడ రోగుల అటెండర్లు వంద మందికి ప్రతి రోజూ దేవస్థానం నుంచి భోజనం అందిస్తున్నారు. అలాగే నిరుపేద రోగులకు అవసరమైన సదుపాయాల్ని కల్పిస్తున్నారు. సువిశాలమైన 11 ఎకరాల్లో నిర్మించిన భవనం అస్తవ్యస్తంగా మారింది. ఎంతో స్థలం ఉన్నా సద్వినియోగం చేసుకోలేని దుస్థితి చోటు చేసుకుంది. శిధిలమైన భవనాలు విషపురుగుల ఉత్పత్తి కేంద్రాలుగా మారి రాత్రి వేళల్లో పెద్ద పెద్ద పాములు దారిలో వస్తున్నాయని చెబుతున్నారు.

**సూపరింటెండెంట్ వివరణ:**

శిధిలమైన భవనాలకు సంబంధించి ప్రభాతవార్త ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మురళి కృష్ణను వివరణ కోరగా తాము పలుమార్లు ఇంజనీరింగ్ విభాగానికి సమాచారం ఇచ్చామన్నారు. వాటిని తొలగించాల్సి ఉంది. వీటిని తొలగించి కొత్త భవనాలు నిర్మిస్తే సిబ్బంది అందుబాటులో ఉండటానికి అవకాశం ఉందని తన వివరణ ఇచ్చారు.

# రూ.ఆరు కోట్లతో శివరాత్రి బ్రహ్మోత్సవాలు..

## ఈవో బాపిరెడ్డి, ట్రస్ట్ బోర్డు చైర్మన్ కొట్టే సాయి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఈవో బాపిరెడ్డి, ఆలయ చైర్మన్ కొట్టేసాయి

శ్రీకాళహస్తి జనవరి 22 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో ప్రతి ఏటా నిర్వహించే శివరాత్రి వేడుకలను ఈసారి మరింత వైభవంగా నిర్వహించు చున్నామని ఆలయ ఈవో బాపిరెడ్డి, చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ గురువారం ఆలయంలోని పరిపాలనా భవనంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో బాపిరెడ్డి మాట్లాడుతూ ఈసారి కొత్త బోర్డు పర్యవేక్షణలో శివయ్య పండుగను అంగరంగ వైభవంగా జరుపుతున్నామన్నారు. ఈ పండుగ బడ్జెట్ ఈసారి ఆరు కోట్ల రూపాయలని అన్నారు. శివరాత్రి పండుగకు కట్టుదిడ్డమైన భద్రతా ఏర్పాట్లను తిరుపతి జిల్లా ఎస్పీ ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అంతేకాకుండా ఈసారి నూతనంగా ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కమిటీ సభ్యులను ఐదు కమిటీలుగా విభజించామన్నారు. వాటిలో క్యూ లైన్ల వద్ద కొంతమంది అన్నదానం వద్ద కొంతమంది ట్రస్ట్ బోర్డు సభ్యులు ఉంటారని భక్తులకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మీరు చూసుకుంటార న్నారు. మరోసారి మరో సమావేశంలో కూటమి ప్రభుత్వ సమావేశం నిర్వహించి వారితో డొనేషన్ కౌంటర్ గురించి చర్చించి ప్రత్యేక కమిటీ వేసి డొనేషన్ కౌంటర్ ను ప్రత్యేకంగా నిర్వహిస్తామన్నారు. అంతేకాకుండా ఈ పండుగ సోషల్ మీడియా ప్రింట్ , ఎలక్ట్రానిక్ ద్వారా యావత్ ప్రపంచానికి తెలియజేస్తామన్నారు. శివరాత్రి పండుగ సందర్భంగా మూడు రోజుల ముందే లోకల్ పాసులు ఇస్తామని అక్కడ నాలుగు కౌంటర్లు ఏర్పాటు చేస్తామని ఆయన అన్నారు. ఫిబ్రవరి 10వ తేదీ నుంచి ప్రారంభమయ్యే ఈ ఉత్సవాలను యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేయాలని వారు అధికారులను ఆదేశించామన్నారు. ట్రస్ట్ బోర్డు ఆలయ చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ మాట్లాడుతూ బుధవారం హారతి అయిన తర్వాత లోకల్ గా ఉన్న వారికి తమ యొక్క ఆధార్ కార్డు బయోడేటా సమర్పిస్తే వారికి అంతరాలయం ఏర్పాటు దర్శనం కల్పిస్తామన్నారు. శివరాత్రి రోజున బయట ప్రదేశాల నుంచి విచ్చేసే భక్తులకు స్కిట్ కాలేజీ నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసి వారిని ఉచితంగా ఆలయానికి సమీపంలో విడిచి పెడతామన్నారు. ఈ విషయమై స్థానిక ఆర్టీవో కు 35 బస్సులు కావాలని విన్నవించగా అయినా సానుకూలంగా స్పందించి ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో ఆయనతోపాటు ఏఈఓ గోపాలకృష్ణారెడ్డి జేఈవో ఆలయ పిఆర్ఓ మోహన్ ఆలయ సిబ్బంది శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీకాళహస్తీశ్వరుని సేవలో కలెక్టర్, ఎస్పి

శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరుని సేవలో జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వరన్, ఎస్పి సుబ్బరాయుడులు పాల్గొన్నారు. గురువారం శ్రీకాళహస్తిశ్వరాలయంలో వచ్చేనెల 10 నుంచి ప్రారంభమయ్యే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్బంగా పట్టణంలోని అన్ని శాఖల అధికారులతో బ్రహ్మగుడి వద్ద సమావేశం నిర్వహించారు. ఈ సందర్బంగా ఆలయంలో చేపట్టే ఏర్పాట్లుతో పాటు స్వామి అమ్మవార్లను దర్శించుకొనుటకు ఇరువురు అధికారులు హాజరయ్యారు. వారికి దక్షిణగోపురం వద్ద ఆలయ చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, ఇఓ డి.బాపిరెడ్డి, ఎఇఓ మోహన్‌లు వేదపండితులతో వేద మంత్రాలతో స్వాగతం పలికారు. స్వామి అమ్మవార్ల అంతరాలయ దర్శనం ఏర్పాటు చేసారు. తరువాత వేదపండితులచే ఆశీర్వచనాలు, స్వామి అమ్మవార్ల చిత్రపటాలను చైర్మెన్, ఇఓ అందించారు. ఈ సందర్బంగా ఆలయంబలో ఏర్పాటు చేసే క్యూలైన్లు, భక్తులకు క్యూలైన్లలో ఏర్పాటు చేస్తున్న సదుపాయాలను అధికారులు అడిగి తెలుసుకున్నారు. ఎక్కడా తోసులాట, తొక్కిసలాట చోటు చేసుకోకుండా క్యూలైన్లు ఏర్పాటు చేయాలని సూచించారు.

## ఆసుపత్రిలో పనిచేయని

# 'మూడో నేత్రం'...!

## -భయాందోళనలో రోగులు



ఆసుపత్రిలో పాడైన సిసి కెమరాలు

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త

మండల కేంద్రమైన ప్రభుత్వాసుపత్రిలో మూడో నేత్రాలు(సిసికెమరాలు) పనిచేయక పోవడంతో రోగులు భయాందోళన చెందుతున్నారు. నిత్యం వందలాది మంది రోగులతో రద్దీగా వుండే ఆసుపత్రిలో సిసి కెమరాలు పనిచేయక పోవడం విడ్డూరంగా వుందని బహిరంగంగానే అంటున్నారు. చిన్న చిన్న దుకాణాలు, హోటళ్ళు తదితర ప్రాంతాలే సిసి కెమరాల స్వాధీనంలో వుంటే వందలాది మంది రోగులు వచ్చే ఆసుపత్రిలో సిసి కెమరాలున్నా మరమ్మత్తుకు గురయితే ఎవరూ పట్టించుకొన్న పాపాన పోలేదన్న విమర్శలున్నాయి. ప్రభుత్వాసుపత్రిలో ప్రతి రోజూ కాన్పుకోసం గర్భవతులు వస్తుంటారు. కొందరు ఇక్కడే ప్రసవిస్తుండగా మరికొందరి పరిస్థితి విషమిస్తే బయట ప్రాంతాలకు తరలిస్తుంటారు. ఆవరణంలో కుక్కల బెడద అధికంగా వుంది. దీంతో శిశువుల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. అంతే కాకుండా ఆసుపత్రి ఆవరణంలోనే ఇటీవల సిబ్బంది బంగారం వస్తువులు దొంగలించబడ్డాయి. అక్కడే వున్న మూడో నేత్రం పనిచేస్తుంటే దొంగ పట్టుబడివారు. రాత్రింబవళ్ళు రోగులతో కిటకిటలాడే ఆసుపత్రిలో సిసి కెమరాలు మరమ్మత్తుకు గురయితే పట్టించుకొనే కరువయ్యారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి సిసి కెమరాలకు మరమ్మత్తు చేయించి, ఆసుపత్రితోపాటు రోగుల భద్రత మెరగుపరచేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

# తుడా అధికారులతో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ సమీక్ష



తిరుపతి కలెక్టరేట్, జనవరి 22, ప్రభాతవార్త

తుడా కార్యాలయంలో గురువారం తుడా ఛైర్మన్, తిరుమల తిరుపతి దేవస్థానం ఎక్స్ అఫిషియో మెంబర్ తెదేపా తిరుపతి పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి డాలర్స్ దివాకర్ రెడ్డి, నూతన తుడా వైస్ ఛైర్మన్ ఆర్. గోవింద రావు అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో తుడా పరిధిలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టుల పురోగతిపై వారు అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి మాట్లాడుతూ, నూతన వైస్ ఛైర్మన్ గోవింద రావుతో కలిసి తుడాను మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజలకు మెరుగైన సేవలందించేందుకు, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలని సూచించారు. నూతన వైస్ ఛైర్మన్ ఆర్. గోవింద రావు మాట్లాడుతూ, సీఎం చంద్రబాబు నాయుడు తనపై నమ్మకంతో తుడా వైస్ ఛైర్మన్‌గా నియమించడం జరిగిందన్నారు. తుడా ఛైర్మన్ డాలర్స్ దివాకర్ రెడ్డి సహకారంతో నిర్దేశించుకున్న లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానని తెలిపారు. లేఅవుట్లు, ప్లానింగ్ విభాగాలకు సంబంధించిన అంశాలపై అధికారులకు పలు సూచనలు చేశారు. అంతకముందు తుడా అధికారులు నూతన తుడా వైస్ ఛైర్మన్ ఆర్ గోవింద రావుకి శుభాకాంక్షలు తెలిపి, పరిచయం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో తుడా కార్యదర్శి శ్రీకాంత్ బాబు, చీఫ్ ప్లానింగ్ అధికారి దేవికుమారి, ఎస్ ఈ కృష్ణారెడ్డి, ఈ ఈ రవీంద్ర బాబు, డి ఈ నరేష్ బాబు, అసిస్టెంట్ ప్లానింగ్ అధికారులు వాణి శ్రీ, వాసుదేవ నాయుడు, హార్టికల్చర్ అధికారి మాలతి, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష

సోమల, జనవరి 22 ప్రభాతవార్త



10 సంవత్సరాల క్రితం చిత్తూరు జిల్లాలోని సోమల మండలం ఇరికిపెంట పంచాయితీ ఎర్రమిట్టలో జరిగిన దారుణ హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ మదనపల్లి రెండవ అదనపు జిల్లా సెషన్ కోర్టు తీర్పునిచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి ఎర్రమిట్టకు చెందిన కమలమ్మకు వీరపల్లి శ్రీనివాసనాయుడుకు భూ తగాదా ఉంది. ఈ క్రమంలో 2016 జనవరి 16వ తేదీ కమలమ్మ ఆమె కుమార్తెలు పొలం వద్ద ఉండగా ముందుగానే కత్తితో అక్కడికి వచ్చిన శ్రీనివాస నాయుడు ఆమెపై కత్తితో దాడికి దిగాడు. దీంతో తీవ్ర గాయాలైన కమలమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో సోమల పోలీసులు హత్య కేసుగా నమోదు చేసి శ్రీనివాసన్ నాయుడు, గంగులమ్మలను ముద్దాయిలుగా చూపారు. 10 సంవత్సరాల పాటు కేసు కోర్టులో నడిచింది. గురువారం కోర్టు తీర్పు వెలుబడింది. శ్రీనివాసులు నాయుడుకు యావజ్జీవ కారాగార శిక్ష మరియు గంగులమ్మకు 12వేల రూపాయలు జరిమానా తో పాటు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ కోర్టు తీర్పునిచ్చిందిముద్దాయిలను మదనపల్లి సబ్ జైలుకు తరలించారు.

# చారిత్రక మండపం కూల్చొద్దంటూ హైకోర్టు స్టే

## మండపాన్ని రక్షించేందుకు నడుం బిగించిన మాజీ మంత్రి రోజా

పుత్తూరు(నగరి), జనవరి 22 ప్రభాతవార్త :

నగరి పట్టణంలోని తరతరాలుగా దేవతా మూర్తులు కొలువు తీరే కొండచుట్టు మండపం రోడ్డు వెడల్పులో భాగంగా కూల్చివేయకుండా రక్షించేందుకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన మాజీ మంత్రి ఆర్.కె.రోజా నడుం బిగించారు. రోడ్డు వెడల్పులో మండపం కూల్చేడం తప్పదని స్థానికులు ఆవేదనకు లోనై నిస్సహాయంగా వున్న తరుణంలో రోజా వారికి కొండంత అండగా నిలిచారు. చెంగమ నాయనం ట్రస్ట్ ద్వారా హైకోర్టులో రిట్ పిటిషన్ వేసేందుకు న్యాయ సహాయం అందించారు. రహదారి వెడల్పులో మండపాన్ని కూల్చకుండా స్టే ఉత్తర్వులు తీసుకువచ్చారు. మండప కూల్చివేత విషయంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు ఎవరూ పట్టించుకోకపోవడంతో నిరాశలో మునిగిపోయిన ప్రజల ఆశలకు స్టే తీసుకురావడం ద్వారా ప్రాణం పోశారు. భక్తుల మనోభావాలను కాపాడాలనే సదుద్దేశ్యంతో వందల సంవత్సరాల చారిత్రక మండపం కూలిపోకుండా మాజీ మంత్రి న్యాయపరంగా అడ్డుకోవడం పట్ల సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

**చరిత్ర, సంప్రదాయాలకు మనమే వారసులం: మాజీ మంత్రి రోజా**

పూర్వీకుల ఆస్తులకే కాదని వారి చరిత్ర, సంప్రదాయాలకు కూడా మనమే వారుసులమని మాజీ మంత్రి ఆర్.కె.రోజా అన్నారు. హైకోర్టు నుంచి స్టే తీసుకువచ్చినందుకు గురువారం సాయంత్రం మండల నిర్వాహకులు, గ్రామ పెద్దలు, స్థానిక వైసిపి నాయకులు ఆమెను దుస్సాలువాతో ఘనంగా సత్కరించారు. కొండచుట్టు ఉత్సవాల్లో దేవతా మూర్తులు కొలువయ్యే మండపాన్ని రక్షించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వందల సంవత్సరాల చరిత్ర వున్న పవిత్ర మండపాన్ని కాపాడుకోవడం మన బాధ్యతని తెలిపారు. సాళువ రాజులు, కార్వేటినగరం రాజులు, జమీందార్లు, పాలెగాళ్ల అంటూ ఆరు శతాబ్దాలుగా ఎన్నో తరాల వాళ్లు కాపాడిన చారిత్రక, విశేష కట్టడాన్ని మనం కాపాడుకుందామని తెలిపారు.



చారిత్రక కొండచుట్టు మండపం



## మద్యం తాగి వాహనాలు నడిపితే ఖబర్దార్

శ్రీకాళహస్తి జనవరి 22 ప్రభాతవార్త



మద్యం తాగి వాహనాలు నడిపితే ఉపేక్షించేది లేదని వన్ టౌన్ ఎస్ఐ వెంకటసుబ్బారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన గురువారం సాయంత్రం పట్టణంలోని స్థానిక పెళ్లి మండపం కూడలి వద్ద ద్విచక్ర, ఆటోలు నడిపే వారిని బ్రీత్ అనలైజర్ ద్వారా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన అటుగా వెళుతున్న ప్రభాతవార్త ప్రతినిధితో మాట్లాడుతూ మద్యం తాగి వాహనాలు నడిపే వారిని, ట్రిపుల్ రైటింగ్, హెల్మెట్ లేకుండా వెళ్లే వారిని గుర్తించి కేసులు నమోదు చేస్తున్నామన్నారు. చట్టనుపేక్షించే వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. ఆయనతో పాటు సిబ్బంది ఉన్నారు.

## తొట్టంబేడు ఎస్ఐకు సన్మానం

తొట్టంబేడు జనవరి 22 ప్రభాతవార్త



తొట్టంబేడు పోలీస్ స్టేషన్ ఎస్సైగా నూతనంగా నియమితులైన బాలకృష్ణను పూడి గ్రామపంచాయతీ జె శేషము నాయుడు ,వసంత నాయుడు, జుపెంచలయ్య ,డి ప్రభాకర్, పి గణేష్ లుమర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు వారు మండల పరిస్థితి లను వివరించారు.

## కన్నుల పండుగలా పశువుల పండుగ

చౌడేపల్లి, జనవరి 22 ప్రభాతవార్త



మండలంలోని పలు ప్రాంతాల్లో పశువుల పండుగను ఘనంగా నిర్వహించారు. కోడె గిత్తలు పౌరుషంతో రంకెలేయగా, కుర్రకారు ఉరకలేసి వాటిని అదుపు చేసేందుకు తంటాలు పడ్డారు. మండల వ్యాప్తంగా పశువుల పండుగను కన్నుల పండుగలా జరుపుకొన్నారు. బాంధాగారాల్లో ధన్యా సాధారణంగా సంక్రాంతి తర్వాత వచ్చే గురువారం మండలంలోని పలు గ్రామాల్లో పశువుల పండుగను జరుపుకొంటారు. ఈక్రమంలో ఉదయాన్నే ఆయా గ్రామాల్లో గ్రామదేవతలకు విశేష పూజలు జరిపారు. అనంతరం పశువులును అందంగా అలంకరించి ఊరేగించారు. సంక్రాంతిని తలపించే విధంగా ఇళ్ళముందు రంగురంగుల ముగ్గులు, గొబ్బెమ్మెలనుంచి ఆటపాటల్లో మహిళలు మునిగి పోయారు.

## స్విమ్స్ మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం

తిరుపతి హెల్త్, జనవరి 22, ప్రభాతవార్త



శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) మెడిసిన్ విభాగం ఆధ్వర్యంలో గురువారం శ్రీ పద్మావతి ఆడిటోరియం, ఓ.పి.డి. బ్లాక్ నందు అతిథి ఉపన్యాసం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా. రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి. కుమార్, ముఖ్య అతిథి డా. పద్మకుమార్, డీన్ డాక్టర్. అలోక్ సచన్, రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్. బిట్లా, మెడిసిన్ విభాగాధిపతి ప్రొఫెసర్ (సీనియర్ గ్రేడ్ ) డా. అల్లాడి మోహన్, ప్రొఫెసర్ డా. హరిక్రిష్ణ, డాక్టర్ రమ, డాక్టర్ రమ్య, అసిస్టెంట్ ప్రొఫెసర్స్, డాక్టర్. భార్గవ్, డాక్టర్ మనో లాస్య, డాక్టర్ బాబులు జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. చైర్మన్, పార్కింసోనియన్ ఇన్స్టిట్యూట్, న్యూ సౌత్ వాల్స్, ఆస్ట్రేలియా నుండి ప్రొఫెసర్ డా. పద్మకుమార్, ఇంటిగ్రేటెడ్ మేనేజ్ మెంట్ ఆఫ్ పార్కిన్సన్స్ డిసీస్, ఇన్నియేషన్ ఆఫ్ జెరియాట్రిక్స్ సర్వీసెస్ అనే అంశాలపై పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించారు. మెడిసిన్ విభాగాధిపతి, సీనియర్ గ్రేడ్ డా. అల్లాడి మోహన్ మాట్లాడుతూ డా. పద్మకుమార్ వృద్ధులలో పార్కిన్సన్స్ వ్యాధి, సామర్థ్యంపై దృష్టి సారించే కన్సల్టెంట్ జెరియాట్రిషియన్ ఆస్ట్రేలియాలో వున్నారని, అక్కడ వృద్ధుల కోసం ప్రత్యేకంగా వైద్య సేవలను నిర్వహిస్తున్నారనీ, అలాగే కింగ్స్ కాలేజ్ లండన్లోని పార్కిన్సన్స్ వ్యాధి సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ అంతర్జాతీయ సభ్యుడని తెలిపారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి అతిథిగా చైర్మన్, పార్కింసోనియన్ ఇన్స్టిట్యూట్, న్యూసౌత్ వాల్స్ ఆస్ట్రేలియా నుండి ప్రొఫెసర్ డా. పద్మకుమార్ స్విమ్స్ కు రావడం వారి యొక్క అనుభవాలను మనతో పంచుకోవడం సంతోషదాయకమని తెలియజేశారు. శ్రీవారి వైద్య సేవాలో భాగంగా, ఆస్ట్రేలియా దేశంలోని న్యూ సౌత్ వేల్స్ కు చెందిన హంటర్ పార్కిన్సన్స్ సొసైటీ ఛైర్ మరియు కన్సల్టెంట్ జెరియాట్రిషియన్ అయిన డా. చంద్రశేఖర్ పిల్లై పద్మకుమార్ జెరియాట్రిక్ సేవల ప్రారంభం, పార్కిన్సన్స్ వ్యాధి సమగ్ర నిర్వహణ అంశంపై అతిథి ఉపన్యాసం అందించారు. ఈ సందర్భంగా, వైద్య విభాగం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రెండు ప్రత్యేక క్లినిక్‌లను డా. పద్మకుమార్ ', డైరెక్టర్ కమ్ వైస్ ఛాన్సలర్ డా. ఆర్.వి. కుమార్ ప్రారంభించారు. జెరియాట్రిక్ మెడిసిన్ క్లినిక్ – ప్రతి శుక్రవారం మధ్యాహ్నం 3.00 గంటల నుండి 4.00 గంటల వరకు, వయోజన టీకాకరణ క్లినిక్ – ప్రతి శనివారం మధ్యాహ్నం 3.00 గంటల నుండి 4.00 గంటల వరకు ఉంటుంది. ఈ సందర్భంగా స్విమ్స్ సంచాలకులు మరియు ఉపకులపతి డా ఆర్.వి. కుమార్ కుమార్ అతిధిగా విచ్చేసిన డా. పద్మకుమార్‌ని శాలువతో సన్మానించి మెమొంటోను అందజేశారు. ఈ కార్యక్రమంలో మెడిసిన్ విభాగపు వైద్యులు, పి. జి రెసిడెంట్స్, ఇంటర్నన్స్, యం.బి.బి. యస్ విద్యార్థులు, కాలేజీ ఆఫ్ ఫిజియోథెరపీ ప్రిన్సిపాల్ డా. మాధవి, నర్సింగ్ సూపరింటెండెంట్ సునీత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటనను విజయవంతం చేయండి

ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్

పుత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త :



ఈ నెల 24వ తేదీన నగరి పట్టణంలో జరిగే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనను విజయవంతం చేయాలని తెలుగుదేశం పార్టీ నగరి క్యాడర్‌కు ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ పిలుపునిచ్చారు. పట్టణంలో గురువారం జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలే కాదు, ఏ ఎన్నికల్లోనైనా నగరిలో తెలుగుదేశం పార్టీ జెండా మాత్రమే ఎగురుతుందనే సంకేతాన్ని మనం రాష్ట్రమంతా తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో టిడిపి గెలిచింది కాబట్టే నాయకులు, కార్యకర్తలు తలెత్తుకుని తిరుగుతున్నారని తెలిపారు. మన పార్టీ అధికారంలో వుందని ధైర్యంతో వుంటామని, అటువంటి పార్టీ గెలుపునకు కృషి చేయాలన్నారు. ఆ దిశంగా పార్టీ క్యాడర్ తమలోని చిన్న చిన్న సమస్యలను పక్కన పెట్టాలని, ఐక్యతగా వుండాలని తెలిపారు. పార్టీకి నష్టం కలిగేలా వ్యవహరిస్తే కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్టేనని తెలిపారు. పార్టీ బాగుంటే క్యాడర్ కూడా బాగుంటుందని గుర్తుంచుకోవాలని తెలిపారు. సమావేశంలో పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాణిపాకంలో శ్రీమహాసరస్వతి యాగమునకు విస్తృత ఏర్పాట్లు

కాణిపాకం, జనవరి 22 ప్రభాతవార్త:



మాఘ శుద్ధపంచమి (వసంత పంచమి) సందర్భంగా సత్య ప్రమాణాల దేవుడు కాణిపాకం శ్రీవినాయకుని చెంత శుక్రవారం శ్రీమహాసరస్వతి యాగమును నిర్వహించనున్న సందర్భంగా దేవస్థానం అధికారులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. దేవస్థానం ఆస్థాన మండపంలో ఉదయం 9 గంటలకు ఈయాగమును అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా నిర్వహించనున్నారు. ఈఏడాది 10వ తరగతి పరీక్షలకు హాజరగు విద్యార్థిని విద్యార్థులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశం వుండడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా దేవస్థానం ఏర్పాట్లు చేస్తోంది. ఈమేరకు ఆలయ ఛైర్మన్ వి.మణినాయుడు, ఈఓ పెంచల కిషోర్‌లు ఆలయ అధికారులు, ఇంజనీరింగ్ అధికారులతో కలసి స్థానిక ఆస్థాన మండపంలో చేపట్టవలసిన ఏర్పాట్లును గురించి పరిశీలించారు. ఈసందర్భంగా ఈఓ ఇంజనీరింగ్ అధికారులు, ఆలయ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఈ వెంకట నారాయణ, ఏఈఓ రవీంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

## జెనిత్ బ్లాక్ మార్కెట్ లోకి విడుదల

తిరుపతి విద్య, జనవరి 22 ప్రభాతవార్త

బ్లెండర్స్ ప్రైడ్ జెనిత్ బ్లాక్ ఎడిషన్‌ను మార్కెట్లోకి విడుదల చేసినట్లు పెర్నాడ్ రికార్డ్ ఇండియా సిఎంఓ దేబాశ్రీ దాస్ గుప్తా తెలిపారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ విలాసం, విలక్షణతకు ప్రాధాన్యతనిచ్చే ఆకర్షణీయమై నలుపు రంగులో జన్మిత్ బ్లాక్ ఎడిషన్ను విడుదల చేశామన్నారు. హస్తకళా నైపుణ్యాన్ని తెలియచేసే ఒక అందమైన శైలి ద్వారా తన ప్రధామైన విలువలను నిజం చేస్తోంది. ఒక మిలియన్ బాటిల్స్ కి పరిమితమైన జెనిత్ బ్లాక్ ఎడిషన్ అనేది కేవలం శ్రేష్టతను ఆరాధించటమే కాకుండా దానిని ప్రతిబింబించే వ్యక్తుల కోసం కూడా రూపొందించబడిందని వెల్లడించారు.

## పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి

సహకరించాలి, -నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి మౌర్య



తిరుపతి,జనవరి 22ప్రభాతవార్త: తిరుపతి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారీకి అన్ని రాజకీయ పార్టీలు సహకరిం చాలని నియోజకవర్గ ఓటరు నమోదు అధికారి, నగరపాలక సంస్థ కమిషనర్ ఎన్.మౌర్య కోరారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మౌర్య మాట్లాడుతూ పారదర్శకమైన ఓటర్ల జాబితా తయారికి అందరూ సహకరించాలని విజ్ఞప్తి చేశారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ 2026 పై ఉన్న సందేహాలను నివృత్తి చేశారు. 2025 జాబితా లోని ఓటర్లను 2002 ఓటర్ల జాబితా లోని ఓటర్లతో మ్యాపింగ్ ప్రక్రియ చేయు నిమిత్తం అందరూ బూత్ లెవెల్ అధికారులు, సూపెర్వైసర్స్,గుర్తింపు పొందిన అన్ని రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి ఇంటింటికీ వెళ్లి వివరాలు సేకరించి మ్యాపింగ్ శాతాన్ని పెంచాలని తెల్పినారు. ఈ సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, ఎన్నికల ఉప తహసీల్దార్ సుధాకర్ నాయక్,వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్కినేని నాగేశ్వరరావు పేరున పేదలకు అన్నదానం

తిరుపతి, జనవరి 22ప్రభాతవార్త:



నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు 12వ వర్ధంతి సందర్భంగా అక్కినేని అభిమాన సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నదానం చేశారు. ముఖ్య అతిథులుగా జనసేన నేత ఆర్కాట్ కృష్ణ ప్రసాద్, ప్రకాశం మున్సిపల్ పార్క్ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గోపీనాథ్ నాయుడు పాల్గొని గురువారం ఉదయం ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు ఆర్కాట్ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ నటసామ్రాట్ అక్కినేని నాగేశ్వరరావు సినీ చరిత్రలో పద్మశ్రీ ,పద్మభూషణ్ ,పద్మ విభూషణ్ పొందిన ఏకైక వ్యక్తిఅని తెలిపారు. తెలుగు సినీ పరిశ్రమలో రెండు కళ్ళల్లో ఒక కన్ను ఏఎన్నార్‌గా పేరు ప్రఖ్యాతలు పొందారని ఎంతో మంది పేద విద్యార్థుల కోసం కళాశాలలు ఏర్పాటు చేసి ఉచితంగా చదువులు చెప్పించి వారిని ఉన్నత శిఖరాలను అధిరోహించే విధంగా చేశారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వెంకట ముని, జగన్నాధం ,బాలరాజు, వేణు, చంద్ర, ప్రసాదు, రమేష్, శీను, పార్థసారథి, బీవీ కేశవులు, రమణ, చంద్ర, మునిరత్నం, గౌరీ , వెంకటరామ శెట్టి తదితరులు పాల్గొన్నారు

## డాక్టర్ చాంద్ బాషా దావుల్జీకి ప్రతిష్టాత్మక ఖినెసాఖి ఫెలోషిప్ అవార్డు



తిరుపతి హెల్త్, జనవరి 22, ప్రభాతవార్త తిరుపతిలోని పాథ్‌జీన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రిన్సిపల్, సైంటిస్ట్ డాక్టర్ చాంద్ బాషా దావుల్జీకి ప్రతిష్టాత్మకమైన నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ (ఎన్.ఇ.ఎస్.ఎ) ఫెలోషిప్ అవార్డు – 2025 లభించింది. బీహార్‌లోని పాట్నాలో ఉన్న ఐసిఏఆర్‌రిసెర్చ్ కాంప్లెక్స్ ఫర్ ఈస్టర్న్ రీజియన్‌లో జనవరి 22న జరిగిన ఖిఎన్విరాన్‌మెంటల్ స్టివార్డ్‌షిప్ ఫర్ సస్టైనబుల్ అగ్రికల్చర్ అండ్ క్లైమేట్ చేంజ్ మిటిగేషన్ 2026) జాతీయ సదస్సు ప్రారంభోత్సవంలో ఈ పురస్కారాన్ని ఆయనకు అందజేశారు. పర్యావరణ విజ్ఞాన శాస్త్రంలో దశాబ్దానికి పైగా విశేష కృషి చేసిన శాస్త్రవేత్తలకు అకాడమీ అందించే అత్యున్నత పురస్కారాలలో ఈ ఖినెసాఖి ఫెలోషిప్ ఒకటి. గత 10 ఏళ్లుగా పర్యావరణ కాలుష్యం, అది మానవ ఆరోగ్యంపై చూపే ప్రభావం అనే అంశంపై డాక్టర్ చాంద్ బాషా చేసిన పరిశోధనలకు గాను ఈ గుర్తింపు లభించింది. న్యూఢిల్లీలోని నేషనల్ ఎన్విరాన్‌మెంటల్ సైన్స్ అకాడమీ లక్ష్యాలకు అనుగుణంగా, ప్రజారోగ్యాన్ని రక్షించే నివారణా చర్యలపై ఆయన పరిశోధనలు విలువైన సమాచారాన్ని అందించాయి. అవార్డు స్వీకరించిన అనంతరం డాక్టర్ చాంద్ బాషా మాట్లాడుతూ నా పరిశోధన ప్రయాణంలో నాకు ఎల్లప్పుడూ అండగా నిలిచిన నా గురువు, ఎస్వీ యూనివర్సిటీ మాజీ వైస్ ఛాన్సలర్ రాజారామి రెడ్డికి, తిరుపతి పాథ్‌జీన్ హెల్త్ కేర్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ రహమతుల్లాకి, ఎస్వీ యూనివర్సిటీలోని ఇతర అధ్యాపక బృందానికి నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను అని పేర్కొన్నారు.

## బాల్యవివాహాలపై కట్టడి అవసరం!

శ్రీకాళహస్తి,జనవరి 22 ప్రభాతవార్త



బాల్యవివాహాలపై కట్టడి అవసరం అని జిల్లా కలెక్టర్ పిలుపు నిచ్చారు. గురువారం బ్రహ్మగుడివద్ద ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే శివ రాత్రి కళ్యాణోత్సవం సందర్భంగా బాల్యవివాహాల సమస్య చోటు చేసుకుంది. ఈ సమస్య దేశ స్థాయిలో చర్చనీయాంశంగా మారిందన్నారు. అయితే గత ఐదేళ్ళుగా బాల్యవివాహాల కట్టడి అయ్యాయన్నారు. ఈ ఆవిష్కరణలో ఆలయ బోర్డు చైర్మెన్ కొట్టెసాయి ప్రసాద్, కలెక్టర్ వెంకటేశ్వరన్,ఎస్‌సి సుబ్బరాయుడు, ఎఎస్‌పి రవిమనోహారాచారి, ఆర్‌డిఓ భానుప్ర కాష్‌రెడ్డి, బోర్డు సభ్యులు గుర్రప్పశెట్టి, గోపినాధ్, రాఘవయ్య, నాగరాజు, కుసుమకుమారి, హేమావతి, పగడాల మురళి, లక్ష్మమ్మ, స్రవంతి, లక్ష్మీనారాయణ,సావిత్రి,శైలజ తదితరులు పాల్గొన్నారు.

## ఉచిత వైద్య శిబిరం పేదలకు వరం

శ్రీకాళహస్తి రూరల్ జనవరి 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలం చెర్లోపలి గ్రామ సచివాలయంలో కోకోకోలా సంస్థ వై ఫోర్ డి ఫౌండేషన్ సంస్థల సంయుక్త సహకారంతో ఉచిత వైద్య చికిత్స శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన కోకాకోలా సంస్థ ప్యాక్ ఆఫీసర్ పి.నితేష్ మాట్లాడుతూ మన గ్రామంలో ఉన్న పేదలకు నిరుపేదలకు కార్పొరేట్ వైద్యాన్ని అందించాలని సంకల్పంతో కంటి సమస్యలు మహిళలకు గైనిక్ సమస్యలు పురుషులకు బీపీ షుగర్ ఇతర జనరల్గా సమస్యలు ఉంటే ఉచితంగా పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయాలన్న సంకల్పంతో కోకోకోలా కంపెనీ ఈ కార్యక్రమాన్ని చేపట్టినదన్నారు. అనంతరం జనార్దన్ మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో గ్రామాలలో పెట్టే వైద్య శిబిరాల ద్వారా సమస్యను గుర్తించి మెరుగైన వైద్యం కోసం వైద్యుల సూచనల మేరకు పెద్ద ఆసుపత్రులలో చికిత్స పొంది ఆరోగ్యంగా ఆనందంగా ఉండాలని తెలిపారు. అనంతరం స్థానిక సంస్థ ఆకాంక్ష స్వచ్ఛంద సేవ సంస్థ ప్రతినిధి డాక్టర్ మర్ధాల రవిబాబు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న నిరుపేదలకు సిఎస్ఆర్ ఫండ్ ద్వారా మెరుగైన వైద్య సేవలు కార్పొరేట్ స్థాయిలో అందిస్తున్న మన కోకో కోలా కంపెనీ, వై ఫోర్ డి సంస్థలకు ధన్యవాదాలు తెలుపుతూ భవిష్యత్తులో ఇలాంటి ఉచిత మెగా వైద్య శిబిరాలు ఎన్నో నిర్వహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుష్మ డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ తేజ హర్ష సచివాలయ కార్యదర్శి బాలమురళి, సురేష్ ,ఆశ అంగన్వాడి ఏఎన్ఎం వై ఫోర్ డి సభ్యులు ఖలీల్ అనిల్ కుమార్ గ్రామస్తులు సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ సీఎంను కలిసిన వైస్ ఎంపీపీ

తొట్టంబేడు జనవరి 22 ప్రభాతవార్త



విజయవాడలోని తాడేపల్లి స్వగృహంలో రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డిని గురువారం తొట్టంబేడు మండల వైస్ ఎంపీపీ కన్నలి మల్లికమ్మ, కన్నలి భాస్కర్ రెడ్డి దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. త్వరలోనే పాదయాత్ర కార్యక్రమం చేపట్టనున్నానని జగన్మోహన్ రెడ్డి వారితో మాట్లాడారు. వైసిపి పార్టీని ప్రజల్లోకి తీసుకెళ్లి, పార్టీ బలోపేతానికి కృషి చేయాలని జగన్మోహన్ రెడ్డి వారికి సూచించినట్లు తెలిపారు. పార్టీని నమ్ముకుని కష్టపడుతూ ఉన్న ప్రతి ఒక్క కార్యకర్తకి పార్టీలో సముచిత స్థానం కల్పిస్తానని వారికి భరోసా ఇచ్చినట్లు తెలియజేశారు.

## పరశురాముని సేవలో పాణ్యం ఎమ్మెల్యే

ఏర్పేడు, జనవరి 22 ప్రభాతవార్త

శ్రీ పరశురామేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీచరితారెడ్డి పాణ్యం ఎమ్మెల్యే ఉమెన్ అండ్ చైల్డ్ కమిటీ చైర్ పర్సన్ గ్రీష్మ కావలి ఎమ్మెల్సీ లు స్వామి వారి దర్శనార్థంకు విచ్చేశారు. వారికి ఆలయ చైర్మన్ బత్తల గిరినాయుడు స్వాగత ఏర్పాటు చేసి తీర్థ ప్రసాదాలు అందజేశారు .వారిని దేవాలయము గురించి అడగగా వారు ఎంతో ఆనందంగా ఉందని స్పందించి ఆలయ అభివృద్ధికి కృషి చేస్తామని హామీ ఇచ్చారు

# తిరుపతి డివిజన్

## రాజశ్యామల దేవి అలంకరణలో శ్రీమరకతశక్తికాళి

రామచంద్రాపురం, జనవరి 22 ప్రభాతవార్త:



రాయలచెరువు సమీపంలో వెలసియున్న శ్రీశక్తి పీఠంలో గురువారం రాజశ్యామలదేవి అలంకరణలో మరకతశక్తి కాళీదేవి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి వివిధ రకాల సుగంధ పరిమళద్రవ్యాలతో ఆలయ అర్చకులు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం నూతన వస్త్రాలు, పలురకాలు పుష్పాలు, నెమలి పింఛాలతో అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాతాజీ రమ్యానంద భారతి శ్రీజ్ఞానమాతంగి అమ్మవారి మూలమంత్ర హోమం ఉపదేశించారు.

## నాగలాపురంలో జాబ్‌మేళాకు విశేష స్పందన

నాగలాపురం, జనవరి 22 ప్రభాతవార్త:



మండల కేంద్రమైన నాగలాపురం ఎంపీడీవో కార్యాలయంలో రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సిడాప్ సంయుక్త ఆధ్వర్యంలో సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం సహకారంతో జాబ్ మేళాను నిర్వహించారు ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఒక సారి జాబ్‌మేళా నిర్వహించబడుతుందని తెలియజేశారు. ఇక్కడ గురువారం జరిగిన జాబ్‌మేళాలో సెలెక్ట్ అయిన వారికి 13500 నుంచి 25 వేల వరకు వేతన సదుపాయం కలదన్నారు. అదే విధంగా ఉద్యోగంలో సెలెక్ట్ కాని వారికి త్వరలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల సత్యవేడులో స్కిల్‌హబ్ ఏర్పాటు చేశామని అందులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తానని తెలిపారు. జాబ్‌మేళాలలో 12 కంపెనీలు హాజరయ్యాయన్నారు. దాదాపు 700 ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్‌మేళాకి 247 మంది హాజరవ్వగా, 104 మంది వివిధ కంపెనీలకు ఉద్యోగ అర్హత పొందడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో గుణశేఖర్‌రాజు, తహసీల్దార్ హనుమాన్ నాయక్, వీఆర్వో నాగభూషణం, మాజీ ఎంపీపీ మురళి, ఎస్ఎం సురేష్, మాజీ ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, రాజమాణిక్యం, పరశురాం శిల్పి, అన్బు, జె.మహేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భద్రతాపరమైన తనిఖీలు....

రేణిగుంట జనవరి 22 ప్రభాతవార్త



తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాలతో అడిషనల్ ఎస్పీ రవి మనోహరాచారి సూచనల నేపథ్యంలో గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తు భద్రతా చర్యల్లో భాగంగా రేణిగుంట డిఎస్పి శ్రీనివాసరావు పరివేక్షణలో రూరల్ సీఐ మంజునాథరెడ్డి గాజులమండ్యం ఎస్సై నాగరాజు తమ సిబ్బంది, విమానాశ్రయ సిఐఎస్ఎఫ్ బలగాలతో విమానాశ్రయానికి వెళ్లే మార్గాల్లో గురువారం విస్తృత తనిఖీలు చేపట్టారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాల హెచ్చరికల నేపథ్యంలో తిరుపతి (రేణిగుంట) అంతర్జాతీయ విమానాశ్రయం భద్రత కోసం తనిఖీలు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. విమానాశ్రయానికి వెళ్లే మార్గాల్లోని ప్రతి వాహనాన్ని నిలిపి క్షుణ్ణంగా బాంబు, డాగ్ స్క్వాడ్లతో పరిశీలిస్తున్నారు. అనుమానాస్పదవ్యక్తులవివరాలుగుర్తింపుకార్డుల ద్వారా తెలుసుకుంటున్నారు. రేణిగుంట అర్బన్‌పోలీస్‌స్టేషన్ పరిధిలో సీఐ జయచంద్ర, ఎస్సై ధర్మారెడ్డి, తమ సిబ్బందితో తనిఖీలు చేస్తున్నారు

## నేడే రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో కిసాన్ మేళా

**రేణిగుంట జనవరి 22 ప్రభాతవార్త** రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నందు శుక్రవారం రైతులకు కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు కృషి విజ్ఞాన కేంద్రం హెడ్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ శ్రీనివాసులు తెలిపారు. మేళాలో రైతులకు వ్యవసాయ అనుబంధ శాఖల శాస్త్రవేత్తలు, జిల్లా అధికారులు రబి సీజన్లో సాగు చేస్తున్న వివిధ ఆహార ఉద్యానవన పంటలలో దిగుబడును సాధించడానికి చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులను వివరిస్తారన్నారు. ప్రకృతి వ్యవసాయం, కోళ్ల పాడి పశువుల పెంపకం నూతన వ్యవసాయ సాంకేతికతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

## 12న జరిగే సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి

పుత్తూరు రూరల్, జనవరి 22 ప్రభాతవార్త:



కార్మికుల సమస్యల పరిష్కారంలో కార్మిక వర్గం సామర శీల పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. పుత్తూరు డివిజన్ సమావేశం ఏఐటీయూసీ డివిజన్ కార్యాలయంలో అధ్యక్షుడు గోపి అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్.చంద్రశేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై సమరశీల పోరాటాలకు సిద్ధం కావాలని కేంద్రంలో బీజేపీ మోదీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను రద్దుపరచి నాలుగు లేబర్ కోడ్‌లు తీసుకు వచ్చిందని, ఈ నాలుగు లేబర్ కోడ్‌ల రద్దుకై ఫిబ్రవరి 12న కేంద్ర కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపును జయప్రదం చేయాలని తెలిపారు. ఇప్పటికే సంయుక్త కిసాన్ మోర్చా రైతు సంఘాలు సంపూర్ణ మద్దతు ప్రకటించాయని, ఇతర ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని ఆయన కోరారు. సమావేశంలో ఏఐటీయూసీ ప్రధాన కార్యదర్శి సిద్ధంశెట్టి, చంద్రబాబు, డివిజన్ నాయకులు ధనలక్ష్మి, మారెమ్మ, బాబు, రమేష్, నవీన్, పయణి, గుణశేఖర్, దాము, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

## మాయమాటలు చెప్పి నమ్మించి చోరీ

కేవీబీ పురం, జనవరి 22 ప్రభాతవార్త:



బిడ్డలు పుట్టేందుకు మాత్రలిస్తానని ఆ దేవుడు మీకు అండగా ఉంటాడని మాయమాటలు చెప్పి నమ్మించి ఆ దంపతుల నుంచి 20 వేలు తీసుకుని ఉడాయించిన సంఘటన చోటు చేసుకుంది. బాధితుల వివరాల మేరకు... మండలంలోని కళత్తూరు దళితవాడలో పన్నీరు(30), సంధ్య(25) ఇరువురి దంపతులకు సంతానం లేదు. 2026 జనవరి 15వ తేదీ ఉదయం 9 గంటల ప్రాంతంలో ఓ యువకుడు మోటారు సైకిల్‌పై వచ్చి నేను డాక్టర్‌ని అంటూ, గ్రామంలో బిడ్డలు లేరని వారి ఇల్లు ఏదని పక్కింటి ఆమెను అడిగాడు. ఆ దంపతులు ఇంటిలోకి వచ్చారు. వారిని నమ్మపలికించి నేను బిడ్డలను పుట్టిస్తానని ఆ మాత్రలు మింగితే చాలని వాటికి డబ్బులు కావాలని వారిద్దరిని నమ్మబలికాడు. ప్రస్తుతం మా దగ్గర డబ్బు లేదంటే నా దగ్గర ఉన్న నగలను షేఠ్ వద్ద కుదవ పెట్టి నీకు ఇస్తామన్నారు. వారిద్దరిని అతను తెచ్చిన బైక్‌లో ఎక్కించుకుని కేవీబీ పురం వచ్చాడు. నగలు పెట్టి 20 వేలు చేతికి తీసుకున్నాడు. దంపతులను నమ్మబలికి శ్రీకాళహస్తికి రాజీవ్‌నగర్ వద్ద నిర్మాణస్య ప్రదేశంలో వారిద్దరిని కూర్చోబెట్టి వెళ్లిపోయాడు. ఇంకా వస్తాడు..ఇంకా వస్తాడని ఎదురు చూశారు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు.

## ఎస్పీ డబ్ల్యు డిగ్రీ విద్యార్థినిలు నేషనల్ బీచ్ గ్రాప్లింగ్‌లో ప్రతిభ

తిరుపతి విద్య,జనవరి 22 ప్రభాత వార్త



శ్రీ పద్మావతి మహిళా డిగ్రీ , పీజీ కళాశాలలోని విద్యార్థినిలు ఏపి బీచ్ గ్రాప్లింగ్ అసోసియేషన్ 202526 ఈనెల 3వ తేదీ నుండి 5వ తేదీ వరకు రామకృష్ణ బీచ్, విశాఖపట్నం నందు నిర్వహించిన నేషనల్ బీచ్ గ్రాప్లింగ్ పోటీలలో పాల్గొని ఇద్దరు విద్యార్థినిలు మార్చి నెలలో థాయిలాండ్లో జరుగు అంతర్జాతీయ బీచ్ గ్రాప్లింగ్ పోటీలలో పాల్గొనుటకు అర్హత సాధించినారు. ఈ సందర్భంగా గురువారం కళాశాలలో ప్రతిభ చూపిన విద్యార్థినులను కళాశాల ప్రిన్సిపల్ డా. టి నారాయణమ్మ ప్రత్యేకంగా అభినందించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ విద్యార్థినిలు నలుగురు జాతీయస్థాయిలో పాల్గొని అంతర్జాతీయ స్థాయిలో పాల్గొనుటకు అర్హత సాధించిన ఇద్దరు విద్యార్థినిలు డి రిజ్వానా, జె శైలజ లు తమ కళాశాలకు గర్వకారణం అన్నారు. తమ విద్యార్థినిలు చదువుతోపాటు ఆటలలో కూడా మేటిగా ఉన్నారని వ్యాయామ విభాగాధిపతి డా. బి భారతి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మరియు విద్యార్థినిలు పాల్గొన్నారు.

## రిపబ్లిక్ డే ఉత్సవాలకు ఎస్వీఆర్ట్స్ కళాశాల విద్యార్థులు ఎంపిక

తిరుపతి విద్య,జనవరి 22 ప్రభాత వార్త



ఎస్ వి ఆర్ట్స్ కళాశాల ఎన్ సి సి వింగ్ చెందిన ఇద్దరు విద్యార్థులు ఆనంద్, త్రివేణి దేశ రాజధాని ఢిల్లీలో జరిగే ఘనతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొనడానికి ఎంపిక అయ్యారు. అలాగే అమరావతిలో జరిగే ఉత్సవాలకు యుగంధర్, శ్రీనివాసులు,ఫణికుమార్ అనే ముగ్గురు విద్యార్థులు ఎంపిక అయ్యారని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్ వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. ఇది కళాశాలకు గర్వాంగా ఉందన్నారు. ఈ సందర్భంగా ఎన్ సి సి అధికారులు వి రమేష్, డాక్టర్ పురుషోత్తం నాయుడు కి అభినందనలు తెలిపారు.

## ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు



సూళ్లూరుపేట, జనవరి 22 ప్రభాతవార్త: సూళ్లూరుపేట ఆర్టీసీ డిపోలోని నేషనల్ మజ్దూర్ యూనియన్ అసోసియేషన్ ఆధ్వర్యం లో గురువారం డిపో ఎదుట రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్ఎంయు రాష్ట్ర ప్రచార కార్యదర్శి చెంచులయ్య మాట్లాడుతూ కడప జోన్‌లో ఉన్న అన్ని డిపోలలో ఉద్యోగ భద్రత సర్క్యులర్‌ను వెంటనే అమలు చేయాలని కోరారు. డ్రైవర్లు, కండక్టర్లకు, మెకానిక్‌లకు ప్రమోషన్ ప్రక్రియను ప్రారంభించాలని తెలిపారు. ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేయాలని విజ్ఞప్తి చేశారు. టెక్నాలజీ అనుగుణంగా మెయింటెనెన్స్, టూల్స్, మెటీరియల్స్ అన్ని డిపో గ్యారేజీలలో ఉంచాలని చెంచులయ్య అన్నారు. కండక్టర్ లూర్థయ్య అక్రమ సస్పెన్షన్‌ను తొలగించాలని, కండక్టర్ మురళీకృష్ణ మృతికి కారణమైన డిపో మేనేజర్‌పై విచారణ జరిపించాలని చెంచులయ్య తెలిపారు. యూనియన్ నాయకులు ఎం.శేఖర్, కరుణాకర్‌రెడ్డి, శంకరయ్య, రమణయ్య, రాఘయ్య, సుబ్రహ్మణ్యం, హరీష్, కాలేషా, వెంకటయ్య, జమాల్, రామచంద్రయ్య, చెంగయ్య, సునీల్, జానకిరామయ్య తదితరులు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## ఆర్టీసీ కార్మికుల రిలే నిరాహార దీక్షలు



వెంకటగిరి, జనవరి 22 ప్రభాతవార్త: తిరుపతి,కడప రీజనల్‌లోని ఉద్యోగుల సమస్యల పై జోనల్ సెక్రటరీ, జోనల్ మేనేజర్‌కి సమర్పించిన మెమోరాండం లోని సమస్యలు పరిష్కారం కోరకు వెంకటగిరి డిపో ఎదుట ఆర్టీసీ ఉద్యోగులు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. వెంకటగిరి డిపో జాయింట్ సెక్రటరి జి. సుబ్బారావు ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమం నందు ఎస్.కె రియాజ్, వి.వి.చలపతి, బి.ఎస్.మణ్యం, డి.పి.స్వామి, కె.ఎస్.మణ్యం, నరసయ్య, పెంచలయ్య, వెంకటేశ్వర్లు తదితరులు దీక్షలో పాల్గొన్నారు. డిపో సెక్రటరి కె.వి.రత్నం మాట్లాడుతూ సమస్యలు పరిష్కారం కానీ ఏడల జోనల్ కమిటీ పిలుపుమేరకు ఏ విధమైన పోరాటానికి సిద్ధం గా ఉండాలి అని పిలుపునిచ్చారు

## డిపో వద్ద రిలే నిరాహార దీక్షలు



వాకాడు, జనవరి 22 ప్రభాతవార్త: కడప జోనల్ కమిటీ, తిరుపతి జిల్లా కమిటీ పిలుపు మేరకు గురువారం వాకాడు డిపో నందు రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా డిపో అధ్యక్షులు ప్రశాంతి మాట్లాడుతూ కడప జోన్ వ్యాప్తంగా 1/2019 సర్క్యులర్ ఇంప్లిమెంట్ చేయకుండా ఉద్యోగస్తులను ఇబ్బందులకు గురి చేస్తూ అక్రమ సస్పెన్షన్ రిమూవ్ చేస్తూ ఉద్యోగస్తుల్లో ఆందోళనకి గురి చేస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు చొరవ తీసుకొని ఈ సమస్యను వెంటనే పరిష్కారం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపో అధ్యక్షులు ప్రశాంత్, కార్యదర్శి సంపత్ , వర్కింగ్ ప్రెసిడెంట్ వంశీ, కోటయ్య, బాలకృష్ణ, శేషయ్య, గ్యారేజ్ అధ్యక్షులు సుధీర్, జాయింట్ సెక్రటరీ నరేష్, ఉపాధ్యక్షులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## పట్టుకున్నారు... వదిలేశారు!

**- పట్టపగలే తరలిపోతున్న గ్రావెల్ తవ్వకాలు - అరికట్టలేకపోతున్న రెవెన్యూ సిబ్బంది**

**- ప్రభుత్వ సంపదను కాపాడలేకపోతున్న అధికారులు**





దొరవారిసత్రం, జనవరి 22 ప్రభాత వార్త: దొరవారిసత్రం మండల పరిధిలోని గురువారం నెల్లూరుపల్లి గ్రామంలో సర్వే నెంబర్ 2 పట్ట పగలు ప్రభుత్వ భూమిలో అక్రమ గ్రావెల్ తవ్వకాలు నాయుడుపేటకు తరలిపోతున్న పట్టించుకొని రెవెన్యూ అధికారులు ప్రభుత్వ భూమిని కాపాడాల్సిన అధికారులు మామెందు కులే అన్నట్లుగా వ్యవహరించడం ఏంటని పలువురు విమర్శిస్తు న్నారు. అంతే కాకుండా ఎక్కడ ఆక్రమాలు జరిగిన నిమ్మకు నీరెత్తినట్లుగా ఉంటున్నారని రెవెన్యూ అధికారులపై అనేక ఆరోపణలు వస్తున్నా, ఈ మండలంలో చెరువులు కబ్జాలకు గురవుతున్న కాలంగి నదిలో మట్టిని తరలించేస్తున్న పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఎక్కడ కూడా పట్టుకున్న దాఖలు లేవని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో గ్రావెల్ తవ్వకాలు మట్టి తవ్వకాలు యదాచిగా ఇతర మండలాలకు తరలిపోతున్న ఆపేవారు లేరన్నట్లుగా వ్యవహరించడం, పట్టపగలే తరలించకపోతున్నారని రెవెన్యూ సిబ్బందికి ప్రజలు సమాచారం అందించినా విని విన్నట్లుగా ఉంటున్నారని కొందరు వ్యక్తం చేస్తున్నారు.

## ఇ-నారీ సిఆర్పిలకు శిక్షణ



వాకాడు, జనవరి 22 ప్రభాతవార్త: మండల కేంద్రమైన వాకాడులో మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని స్త్రీ శక్తి భవనంలో గురువారం ఏపిఎం పోలమ్మ ఆధ్వర్యంలో ఇ-నారి సిఆర్పిలకు శిక్షణ తరగతుల కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ మండలంలోని అన్ని పంచాయతీ గ్రామాలలో ఈ నారి కార్యక్రమంలో భాగంగా 28 గ్రూపులకు ఇద్దరు సిఆర్పిల ద్వారా గ్రూపులకు సంబంధించి పూర్తిస్థాయిలో సమగ్రంగా డేటా కార్యక్రమం చేస్తారన్నారు. మండలంలోని ఉన్నటువంటి పొదుపు గ్రూపులకు సంబంధించి లోన్ల వివరాలు, పొదుపు వివరాలు, తదితర సంబంధించిన లోన్లు పూర్తిస్థాయిలో ఈ నారి ప్రోగ్రాం ద్వారా తెలుసుకోవచ్చు అన్నారు. ఈ సమావేశంలో సీసీలు రమణమ్మ, సరోజినమ్మ, గున్నయ్య, మాధవి, అకౌంటెంట్ శారద, రమణయ్య, వివోఏలు తదితరులు ఉన్నారు.

## నాయుడుపేటలో ఐద్వా జెండా రెపరెపలు



నాయుడుపేట, జనవరి 22 ప్రభాతవార్త: నాయుడుపేట మండలం ఎన్ ఎస్ ఆర్ కాలనీ నందు ఐద్వా జెండా ఎగరేయడం జరిగింది. హైదరాబాద్‌లో అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం మహాసభలో జరుగుచున్నవి ఈ సందర్భంగా వివిధ మండలాల్లో జెండాను ఎగరవేయడం జరుగుతూ ఉందని మండల కార్యదర్శి చంద్రకళ అన్నారు. ఐద్వా మండల కార్యదర్శి చంద్రకళ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆమె తెలిపారు.

## అధికారులూ.. ప్రజలకు జవాబుదారితో పనిచేయండి

**- ప్రభుత్వ విప్ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**





కుప్పం, జనవరి 22 ప్రభాతవార్త : ప్రభుత్వ అధికారులు ప్రజలకు జవాబుదారితో పనిచేయాలని ప్రభుత్వ విప్, కడ పిఎసి ఛైర్మన్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం స్థానికమండల కార్యాలయంలో ప్రజాప్రతినిధులు, అధికారులతో జరిగిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. సిఎం చంద్రబాబునాయుడు సొంత నియోజకవర్గం కాబట్టి అధికార యంత్రాంగం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలు పరిష్కరించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు గ్రామాల్లో ప్రజల సమస్యలను ఏమిటో గుర్తించి వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలన్నారు. గ్రామాల్లో అధికారుల పనితీరుపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారనే విషయం స్వయంగా తానే గుర్తించానని పేర్కొన్నారు. స్థానిక నేతల సహకారాన్ని తీసుకోవాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో అర్హులకు తప్పక లబ్ది కలిగించాలని ఆదేశించారు. అధికార యంత్రాంగం బాధ్యతతో పనిచేస్తే ప్రజలు కూడా సహకరిస్తారని పేర్కొన్నారు.సమావేశంకు హాజరు కాని అధికారులకు నోటీసులు జారీ చేయాలనిఎంపిడిఒ వెంకటేశ్వర్లును ఆదేశించారు. అనంతరం వివిధ శాఖలపై సమీక్షించారు.కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ బిఆర్ సురేష్‌బాబు, టిటిడి డైరెక్టర్ వైద్యం శాంతారాం, టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, ఎంపిడిఒ వెంకటేశ్వర్లు, తహశీల్దార్ చిట్టిబాబు, కడ సభ్యులు రామచంద్ర, వెంకటేష్, కార్పోరేషన్ డైరెక్టర్లు చెక్కునత్తం మణి, శరవణ, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, శ్రీనివాసులు, ధనశేఖర్, శివకుమార్ పాల్గొన్నారు.

## సంచార జాతుల వారికి ఉచితంగా విద్యుత్ ఇవ్వాలి



వెంకటగిరి, జనవరి 22 ప్రభాతవార్త: సంచార జాతుల వారికి 100 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆ సంఘం నాయకులు తుపాకుల వెంకటేశ్వర్లు తెలిపారు. వెంకటగిరి విద్యుత్‌శాఖ డిఇ కార్యాలయానికి వెళ్లి ప్రభుత్వ సూచనల మేరకు 100 యూనిట్లు సంచార జాతులు వారికి ఇవ్వాలని కోరారు. సంచార జాతుల వారు చేతి వృత్తుల పనుల కోసం విద్యుత్ ఉపయోగిస్తున్నారని చెప్పారు. 100 యూనిట్ల వరకు ఉచితంగా ఇవ్వాలని కోరారు. విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

## చెల్లూరు డ్యామ్ వద్ద రోడ్డు ఏర్పాటు చేయండి



చెల్లూరు డాం వద్ద ఉన్న రోడ్డు దుస్థితి

శ్రీకాళహస్తి రూరల్ (ఏర్పేడు) జనవరి 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నుంచి 26 కిలోమీటర్ల దూరంలో చెల్లూరు డాం ఉందన్న సంగతి అతి కొద్ది మందికే తెలుసు. ఈ చెల్లూరు డ్యాం వెనుక దట్టమైన అటవీ ప్రాంతంలో సదాశివకోన ఉంది. అందుకే దీనికి మరొక పేరు కూడా ఉంది అదే సదాశివకోణ. ఈ డాం వెనుక అతిపెద్ద వాటర్ రిజర్వాయర్లు చూడొచ్చు. ఇక్కడ సెక్యూరిటీగా ఫారెస్ట్ చెక్ పోస్ట్ కూడా ఉంది. ఇక్కడ ఉన్న ఈ డ్యాం లోతు లేకుండా చిన్నపిల్లలు కూడా స్నానం చేసే వీలుంది. ఇక్కడున్న చెక్పోస్ట్ నుంచి సుమారు అర కిలోమీటర్ల దూరంలోనే చెల్లూరు డ్యామ్ ఉంటుంది. ఇక్కడున్న ఈ చెల్లూరు డ్యామ్ స్టెప్పులు స్టెప్పులుగా రూపొందించి ఉన్నారు. ఇక్కడ ప్రతి స్టెప్ దగ్గర ఒక చిన్న మినీ వాటర్ ఫాల్స్ లాగా అద్భుతంగా ఉంటుంది. డ్యామ్ నుంచి కింద వరకు సెవెన్ స్టెప్పులుగా ఏర్పడి ఉంటుంది. ఈ చెల్లూరు డాం పాపా నాయుడుపేట గుడిమల్లంకు రెండు కిలోమీటర్ల దూరంలోనే ఉంది. ఇక్కడికి వచ్చిన భక్తులు దూర ప్రాంత వాసులు ఈ డ్యామ్ దగ్గరకు కచ్చితంగా వచ్చి వెళ్లాల్సిందే. అయితే ఇక్కడకు భక్తులే కాకుండా పర్యాటకులు కూడా వందలాది మంది విచ్చేస్తున్నారు. ఇక్కడ అటవీ రేంజ్ చెక్పోస్ట్ నుంచి డ్యాం వరకు అర కిలోమీటర్ దూరం ఉంది. ఇక్కడున్న రోడ్డు మార్గం రాళ్ల రప్పలు గుంటలతో కూడి ఉంది. నడకతో వెళ్లేవారు ద్విచక్ర వాహనదారులు, కార్లు రావటానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోడ్డు వేస్తే బాగుంటుందని పర్యాటకుల వాపోతున్నారు. అంతేకాకుండా దీనిని టూరిజం చేసి పర్యాటకులకు మరింత ఆహ్లాదాన్ని అందించాలని పర్యాటకులు కోరుతున్నారు. దీనిపై ప్రభుత్వం దృష్టి సారిస్తే బాగుంటుందంటున్నారు.

## రైల్వేకోడూరు వైసీపీకి రథసారథి ఎవరో?

రైల్వేకోడూరు, జనవరి 22(ప్రభాతవార్త : రైల్వే కోడూరు నియోజకవర్గంలో వైసీపీకి రథసారథి ఎవరోనని కార్యకర్తల్లో అయోమయంకు గురవుతున్నట్లు కొంతమంది కార్యకర్తలు విస్మయం చెందుతున్నారని పట్టణంలో భారీగా విమర్శలు వెలువవుతున్నాయి. ఇటీవల కాలంలో కొంతమంది వైసీపీ కార్యకర్తలు తండ్రి లేని బిడ్డ వలె ఎటు వెళ్లాలో అర్థం కాని స్థితిలో ఉన్నారని బహిరంగంగా చర్చించుకుంటున్నారు. ఇటీవల వైసిపి ప్రభుత్వం పోయినప్పటి నుండి వైసీపీకి చెందిన కార్యకర్తల్లో పూర్తిస్థాయి లో ఎటు వెళ్లాలో అర్థం కాని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. నియోజకవర్గంలో వైసీపీ రథసారథికి పోటీ రావడంతో అధిష్టానం కొంత జాప్యం కావడంతో కార్యకర్తల్లో దిక్కుతోచని పరిస్థితి నెలకొనింది. ముఖ్యంగా రైల్వే కోడూరు లో వైఎస్ కుటుంబానికి విధేయతగా ఉన్న రైల్వేకోడూరు రెండవ నియోజకవర్గం గా పరిపాటుగా మారిపోయింది. ఇదే తోవలో క్యాడర్ పూర్తిగా వైసిపి నుండి ఎక్కడికి వెళ్లాలో అర్థం కాని స్థితిలో ఉంది. కొంతమంది మాకు అధిష్టానం గుర్తించిందని పలు రకాల ఉత్తిత్తి మాటలు చెప్పడంతో కార్యకర్తల్లో అయోమయం ఉంది. రానున్న పంచాయితీ ఎన్నికలలో భాగంగా వైసీపీకి గట్టి పట్టున నాయకుడిని గుర్తించి ఏర్పాటు చేయకపోతే రానున్న రోజుల్లో వైసిపికి గడ్డుకాలం నెలకొందిని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికైనా మాజీ ముఖ్యమంత్రి మరియు వైసిపి రాష్ట్ర నాయకులు రైల్వేకోడూరు నియోజకవర్గంపై దృష్టి సారిస్తే మంచిదని లేనిపక్షంలో ఎవరికి వారే యమునా తీరుగా రైల్వే కోడూరు నియోజకవర్గం తారుమారు అవుతుందని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

## కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలి: ఎస్పి





శ్రీకాళహస్తి, జనవరి 22 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రత ప్రధాన లక్ష్యంగా ప్రణాళికలు ఉండాలని జిల్లా ఎస్పి సుబ్బరాయుడు సూచించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్స వాలను ఓ పండగలా నిర్వహించటం ఆనవాయితి. శివరాత్రి పర్వదినాన ఆలయంలో స్వామి దర్శనానికి భక్తులు తహతహలాడుతారు. కాబట్టి వచ్చిన ప్రతిభక్తుడు ఇబ్బంది పడకుండా ఏర్పాట్లు ఉండాలన్నారు. వచ్చిన ప్రతిభక్తుడు సంతృప్తి కరంగా దర్శనం చేసుకోవాలని సూచించారు. శివరాత్రి పర్వదినాన ''విఐపిలకు' ప్రత్యేక దర్శనం టైం ను ఏర్పాటు చేయాలని ఎస్పి సూచించారు. నిర్ధేశించి ప్రదేశాల్లోనే పార్కింగ్ చేయుటకు వాహనదారులకు చైతన్య పరచాలన్నారు. ఆలయ సిబ్బంది అలాగే ఇక్కడకు విధి నిర్వహణకు హాజరయ్యే సిబ్బంది గుర్తింపు కార్డులు ఇవ్వాలని ఎస్పి సూచించారు. కమాండ్ కంట్రోల్ అవసరమైన చోటల్లా సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు. స్విమ్మర్లు అవసరం ఉంటుందని వివరించారు. బాల్యవివాహాలకు పాల్పడేవారిని ప్రోత్స హించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వరన్, ఎఎస్పి రవిమనోహ రాచారి, డివైయస్పి నరసింహామూర్తి, ఆర్‌డివో భానుప్రకాష్‌రెడ్డి, ఇఒ డి.బాపిరెడ్డి, పాలకమండలి ఛైర్మెన్ కొట్టె సాయి ప్రసాద్, సభ్యులు వాకచర్ల గుర్రప్పశెట్టి, పగడాల మురళి, గోపినాథ్, రాఘవయ్య, నాగరాజు, కుసుమకుమారి,, హేమావతి, లక్ష్మమ్మ, స్రవంతి, లక్ష్మీనారాయణ, సావిత్రి, శైలజలు పాల్గొన్నారు.

## ఇ-నారి సిఆర్పిలకు శిక్షణ కార్యక్రమం



తడ, జనవరి 22 ప్రభాతవార్త: తడ మండల సమాఖ్య సమావేశ మందిరంలో ఇ నారీ సిఆర్పిలకు మహిళా సంఘాలలో పని చేసే విధానం మీద ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం జరిగింది. ఈ కార్య క్రమంలో తడ ఏపీఎం రాజారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇనారి సిఆర్పిలు వ్యవస్థను ఉపయోగించి మహిళా సంఘాలు బలోపేతం కొరకు ప్రతి 10 సంఘాలకు ఒక్కరిని నియమించడం జరిగిందన్నారు. అలాగే 25 సంఘాలు దాటినా విఓలలో 10 సంఘాలకు ఒక ఇనారీ మరియు జీవనోపాధులకు సమబంధించి ఇద్దరు సి.ఆర్.పిలను నియమించడం జరిగిందని, ఒకరు వ్యవసాయ జీవన జీవనోపాదులు రెండవ సి.ఆర్.పి వ్యవసాయేతర జీవనోపాధులుపై అవగాహన కల్పించాలన్నారు. అలాగే ప్రతి సంఘం సభ్యురాలికి వారి నెల వారి లెక్కలు మన డబ్బులు మన లెక్కలు మొబైల్ యాప్ నందు సభ్యులు చూసుకొనే విధంగా తయారుచేసిన యాప్ గురించి తెలియజేసారు.

## శ్రీ విజయ గణపతి దేవస్థానం 23వ వార్షికోత్సవం



నాయుడుపేట, జనవరి 22 ప్రభాతవార్త: పట్టణంలోని పిచ్చిరెడ్డి తోపులో వెలసి ఉన్న శ్రీ విజయ గణపతి దేవస్థానం 23వ వార్షికోత్సవ వేడుకలు అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గురువారం ఉదయం శ్రీ విజయ గణపతి స్వామివారి ఉత్సవ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. దాతలు టిడిపి నేత కట్టా వెంకటరమణారెడ్డి,సురేఖరెడ్డిల ఆర్థిక సహకారంతో చెన్నై తేజోవతి బృందం వారిచే పాట కచ్చేరి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు బైనా మల్లికార్జున్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి,గాలి రాజేష్ నాయుడు, సుబ్బారెడ్డి, మణి శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సిఎం పర్యటనకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి: కలెక్టర్ సుమిత్‌కుమార్

పుత్తూరు(నగరి), జనవరి 22 ప్రభాతవార్త : ఈ నెల 24న నగరిలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు పర్యటనకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని చిత్తూరు జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. గురువారం నగరి పట్టణంలోని తహశీల్దారు కార్యాలయంలో అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిగ్రీ కాలేజీ ఆవరణలో ముఖ్యమంత్రి బహిరంగ సభ నిర్వహిస్తున్నందున ఈ సభా స్థలి వద్ద వ్యవసాయ అనుబంధ రంగాల ఆధ్వర్యంలో స్టాల్స్ ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. స్కిల్ డెవలప్‌మెంట్ ద్వారా లబ్ది పొందిన వారిలో ముఖ్యమంత్రి ప్రత్యక్షంగా మాట్లాడతారని తెలిపారు. వివిధ సంక్షేమ పథకాల్లో జిల్లా అభివృద్ధిపై సమగ్ర వివరాలకు సంబంధించిన వివిధ అంశాలపై ఛాయా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. బహిరంగ సభ వద్ద ప్రత్యేక వైద్య శిబిరం, అంబులెన్స్ సిద్దంగా వుంచాలని డిఎం అండ్ హెచ్ఒను ఆదేశించారు. పట్టణంలో ఎక్కడా హోర్డింగ్‌లు వుండకూడదని స్పష్టం చేశారు. పట్టణ ప్రధాన వీధులన్నీ పరిశుభ్రంగా వుండేలా చర్యలు తీసుకోవాలని మునిసిపల్ కమిషనర్‌కు ఆదేశాలిచ్చారు. ఎస్పీ తుషార్ డూడీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి పర్యటించనున్న హెలీప్యాడ్, డిగ్రీ కాలేజీ, ఎస్సీ బాలుర, బాలికల సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి, సాయిబాబా గుడి దగ్గర తదితర ప్రాంతాల్లో పట్టిష్ట బందోబస్తు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ నరేంద్ర పాటిల్, ఆర్డిఒ అనుపమ తదితర అధికారులు పాల్గొన్నారు.

## లారీ ఆటో ఢీ.. ఒకరికి తీవ్ర గాయాలు

పుల్లంపేట, జనవరి 22 ప్రభాతవార్త : మండల పరిధిలోని పుత్తనవారిపల్లె గ్రామ సమీపంలో గురువారం రాత్రి రాజంపేట నుండి పుల్లంపేటకు వస్తున్న ఆటో తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న ఓ లారీ పుత్తనవారిపల్లె సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న ఆటోను ఢీకొనడంతో ఆటో డ్రైవర్ యాసిన్ 25కు తీవ్ర గాయాలయ్యాయి గాయపడిన యువకుడిని స్థానికులు రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు ఈ విషయమై పుల్లంపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

## ఎల్లు మోహన్‌కి అభినందనలు వెల్లువ



పెళ్లకూరు, జనవరి 22 ప్రభాతవార్త: వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోసం శ్రమించిన కార్యకర్తలకు పెద్దపీట వేయడంలో అన్ని పార్టీల కంటే ముందుంటుందని నూతనంగా ఎన్నికైన స్టేట్ వైయస్సార్ టియుసి జాయింట్ సెక్రెటరీ ఎల్లు మోహన్ అన్నారు. సామాన్య కార్యకర్తనైన నన్ను స్టేట్ జాయింట్ సెక్రెటరీ పదవి ఇచ్చి గౌరవిం చినందుకు మా ప్రియతమ మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నా ఆజన్మాంతం రుణపడి ఉంటానన్నారు. నాకు ఈ గుర్తింపు రావడానికి కారకులైన కామిరెడ్డి సత్యనారాయణరెడ్డికి రుణపడి ఉంటానని అన్నారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు కార్యకర్తలు అభినందనలతో ముంచేత్తారు.

## బిసీ సబ్సిడీ రుణాల కథ కంచికేనా!

**- ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో మంజూరు చేసి సంవర్సరం పూర్తయిన గ్రౌండింగ్ కాని వైనం - 10 నెలలుగా లబ్దిదారులు పడిగాపులు**

చిత్తూరు, జనవరి 22 ప్రభాతవార్త: బిసీ సబ్సిడీ రుణాలకు ఆర్థిక సంవత్సరం ప్రారంభంలో దరఖాస్తులు ఆహ్వానించి లబ్దిదారులను ఎంపిక చేసిన ప్రభుత్వం ప్రస్తుతం ఆర్థిక సంవత్సరం ముగియడానికి రెండు నెలలు మాత్రమే సమయం వున్నప్పటికీ జిల్లాలో ఒక్క బిసీ సబ్సిడీ రుణం గ్రౌండింగ్ కాని పరిస్థితి నెలకొంది. మార్చి నెలలో ఆర్థిక సంవత్సరం ముగియనుండటంతో బ్యాంకులు ఈ రెండు నెలలు బిజీగా వుండటంతో బిసీ సబ్సిడీ రుణాల కథ కంచికి చేరే అవకాశం కన్పిస్తోంది. బిసీ సబ్సిడీ రుణాల కోసం ఎంపికైన లబ్దిదారులు ఇప్పటికీ రుణాల గ్రౌండింగ్ కోసం బ్యాంకుల చుట్టూ ప్రదిక్షిణలు చేస్తున్నప్పటికీ బ్యాంకు అధికారులు వారిని ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. బిసీ సబ్సిడీ రుణాల కోసం ఎంపికైన లబ్దిదారులు తమకు ఫిబ్రవరి నెలలోనైనా బ్యాంకులు బిసీ సబ్సిడీ రుణాలను గ్రౌండింగ్ చేసి పుణ్యం కట్టుకోవాలని వేడుకుంటున్నారు. రాష్ట్రంలో గతంలో ఐదేళ్ళ పాటు అధికారంలో వున్న వైకాపా ప్రభుత్వం బిసీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేయలేదని, తాము అధికారంలోకి వస్తే యధావిధిగా బిసీలకు బిసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందిస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చిన తెలుగుదేశం పార్టీ రెండేళ్ళ క్రితం జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో రాష్ట్రంలో అధికారం దక్కించుకుంది. రాష్ట్ర ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నారా చంద్రబాబునాయుడు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బిసీలకు బిసీ కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు మంజూరు చేయడానికి షెడ్యూల్ జారీ చేశారు. ఈ మేరకు గత ఏడాది ఫిబ్రవరి, మార్చి నెలల్లో బిసీ కార్పొరేషన్ ద్వారా అర్హులైన అభ్యర్థుల నుండి సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తులు ఆహ్వానించారు. ఆపై మున్సిపల్, మండల స్థాయిల్లో అధికారులు, బ్యాంకర్లు కలిసి ఇంటర్వ్యూలు నిర్వహించి బిసీ సబ్సిడీ రుణాల కోసం లబ్దిదారుల ఎంపిక ప్రక్రియను చేపట్టి పూర్తి చేశారు. అలాగే బిసీ సబ్సిడీ రుణాల మంజూరు కోసం లబ్దిదారుల ఎంపిక పూర్తి కావడంతో గత ఏడాది ఏప్రిల్ 11వ తేదీన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి పురస్కరించుకుని జిల్లా స్థాయిలో జరిగిన కార్యక్రమంలో బిసీలకు సబ్సిడీ రుణాలు మంజూరు చేశామని చెప్పి 535 మంది లబ్దిదారులకు రూ.11.58 కోట్ల మెగా చెక్కును అప్పటి జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, పూతలపట్టు ఎమ్మెల్యే కలికిరి మురళీమోహన్‌లు అందజేశారు. జిల్లా స్థాయిలో నిర్వహింహిన డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతి కార్యక్రమంలో జిల్లా అధికారులు సబ్సిడీ రుణాల కోసం ఎంపికైన లబ్దిదారులకు మెగా చెక్కులు పంపిణీ చేయడంతో ఇక కేటాయించిన బ్యాంకులకు వెళ్ళి లబ్దిదారులు సబ్సిడీ రుణాలు పొందవచ్చునని అందరు భావించారు. ఇది వరకు సబ్సిడీ రుణాల సంబంధించి అధికారులు, బ్యాంకర్లు కలిసి లబ్దిదారులను ఎంపిక చేసి ఆ మేరకు లబ్దిదారులకు రుణం మంజూరు చేసి యూనిట్లను గ్రౌండింగ్ చేసేవారు. ఆపై ప్రభుత్వం బ్యాంకులకు సబ్సిడీ మొత్తం జమ చేసేది. అయితే ఈ సారి ప్రభుత్వం తాను ముందుగా బ్యాంకులకు సబ్సిడీ మొత్తంను జమ చేస్తామని, ఆపై లబ్దిదారులకు బ్యాంకులు రుణం మంజూరు చేయాలని చెప్పింది. ఈ మేరకు ప్రభుత్వం నుండి ముందస్తు సబ్సిడీ బ్యాంకులకు జమ కాకపోవడంతో జిల్లాలోని ఏ ఒక్క బ్యాంకు ఒక్క బిసీ సబ్సిడీ రుణంను సైతం గ్రౌండింగ్ చేయలేదు. ఫిబ్రవరి, మార్చి నెలల్లో ఇంటర్వ్యూలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేసిన అధికారులు, ఏప్రిల్, మే నెలల్లో సైతం ప్రభుత్వం నుండి ముందస్తు సబ్సిడీ బ్యాంకులకు మంజూరు కాకపోవడంతో బిసీ సబ్సిడీ రుణాల గ్రౌండింగ్‌లో జాప్యం జరుగుతుందని అందరు భావించారు. కొంతమంది లబ్దిదారులు బ్యాంకులకు వెళ్ళి తాము బిసీ సబ్సిడీ రుణాల కోసం ఎంపిక అయ్యామని ఆ మేరకు రుణాలు గ్రౌండింగ్ చేయాలని కోరితే ప్రభుత్వం నుండి బిసీ సబ్సిడీ రుణాలకు సంబంధించి మార్గదర్శకాలు జారీ కావాల్సివుందని ఆ మార్గదర్శకాలు జారీ అయితే ఆపై రుణాల గ్రౌండింగ్ ప్రక్రియ ప్రారంభిస్తామని బ్యాంకు అధికారులు లబ్దిదారులకు స్పష్టం చేశారు. అయితే బిసీ సబ్సిడీ రుణాల కోసం లబ్దిదారులను ఎంపిక చేసి 10 నెలలు పూర్తవుతున్నప్పటికీ ప్రభుత్వం నుండి బ్యాంకులకు ఇప్పటి వరకు ముందస్తు సబ్సిడీ రిలీజ్ కాకపోవడంతో బిసీ సబ్సిడీ రుణాల ప్రక్రియ ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారైంది.

**శ్రీసిటీ ఐమాప్ పరిశ్రమ చేయూతతో ...**

## రామాపురం ప్రభుత్వ స్కూళ్ళకు నూతన శోభ

**-రూ.27.5 లక్షలతో వివిధ వసతుల కల్పన**



సత్యవేడు, జనవరి 22 ప్రభాతవార్త: శ్రీసిటీలోని ఇండియా మెటల్ వన్ స్టీల్‌ప్లేట్ ప్రాసెసింగ్ ప్రైవేటు లిమిటెడ్ (ఐమాప్) పరిశ్రమ చేయూతతో పలు విద్యా వసతులు ఏర్పాటై తడ మండలం రామాపురం ప్రభుత్వ జడ్పీ హైస్కూలు, మోడల్ ప్రాథమిక పాఠశాలలు నూతన శోభను సంతరించు కున్నాయి. ఇక్కడ గతంలో అర్ధాంతర నిర్మాణంలో ఆగిపోయిన తరగతి గదులు, చాలీచాలని మరుగుదొడ్లు, ఇతర అరకొర వసతులతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. శ్రీసిటీ ఫౌండేషనన చొరవతో ఐమాప్ సంస్థ ముందుకొచ్చి, తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత కార్యక్రమాల్లో భాగంగా 27.5 లక్షల రూపాయలు దీని బాగు కోసం వెచ్చించింది. ఒక నూతన భవనం నిర్మాణంతో పాటు అర్ధాంతరంగా ఆగి ఉన్న ఏడు తరగతి గదులు, టాయిలెట్లు, వంట గది, ప్రహరీగోడలకు మరమ్మతులు చేపట్టింది. ఇంకా తరగతి గదుల్లో డెస్కులు, బల్లలు ఏర్పాటు చేసింది. గురువారం శ్రీసిటీ డైరెక్టర్(సీఎస్ఆర్) నిరీషా సన్నారెడ్డి, ఐమాప్ ఉన్నతాధికారుల సమక్షంలో ఐమాప్ మేనేజింగ్ డైరెక్టర్ టయిజో ఇవామి లాంఛనంగా నూతన వసతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇవామీ మాట్లాడుతూ స్థానిక విద్యాసంస్థల మౌలిక సదుపాయాలను బలోపేతం చేయడానికి ఐమాప్ మరిన్ని కార్యక్రమాలు చేపడుతుందన్నారు. ఐమాప్ చొరవను అభినందించిన నిరీషా, శ్రీసిటీ ప్రత్యేక చొరవకు పరిశ్రమల చురుకైన భాగస్వామ్యంతోడై ఈ ప్రాంతంలోని ప్రభుత్వ విద్యాసంస్థల మౌలిక సదుపాయాలు చాలా వరకు మెరుగుపడ్డాయన్నారు. మెరుగుపడ్డ విద్యా వసతులను వినియోగించుకుని విద్యాపరంగా మంచి పురోగతి సాధించాలని విద్యార్థులకు సూచించారు. విద్యా వసతుల కల్పనపై సంతోషం వ్యక్తంచేస్తూ శ్రీసిటీ ఫౌండేషన్, ఐమాప్ సంస్థలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో తడ ఎంఈవోలు వేముల, మల్లికార్జున్, ప్రధానోపాధ్యాయులు మాధవి, పారిజాతమ్మ, ఉపాధ్యాయులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.